నేడు జాతీయ సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సుందరాచార్యుల వీధిలోని ఎస్‌కే గ్రాండ్‌లో కొనిరెడ్డి ఫౌండేషన్ – చదువుల సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, కవి ఏసీ దస్తగిరి, డాక్టర్ ఉమ్మడిశెట్టి రాజయ్య, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొంటారని వివరించారు. 35 మంది కవులు, రచయితలను సత్కరించనున్నట్లు ఆయన తెలిపారు.

‘కడుపాత్రం’ కథాసంపుటికి పురస్కారం

మైదుకూరు : మైదుకూరుకు చెందిన ఉపాధ్యాయుడు, కథా రచయిత తవ్వా ఓబుళరెడ్డి రచించిన ‘కడుపాత్రం’ కథాసంపుటికి కొనిరెడ్డి ఫౌండేషన్ – చదువుల సాహిత్య కళావేదిక జాతీయ పురస్కారం –2025 లభించింది. గతంలో ఈయన రచించిన గండికోట పుస్తకానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ రచయిత అవార్డును, తెలుగు పౌరుషం పుస్తకానికి రాష్ట్ర ప్రభుత్వ గిడుగు రామమూర్తి పురస్కారాన్ని, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. కడప కథ, రాయలసీమ వైభవం పుస్తకాలకు సంపాదకత్వం వహించారు.

ఇంటి, నీటి పన్నులను వసూలు చేయాలి

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఇంజనీరింగ్ విభాగం మస్టర్‌ను కమిషనర్ మల్లికార్జున పరిశీలించారు. ఇంటి, నీటి పన్ను వసూళ్లు చేయాలని, అందుకు సంబంధించి పలు సూచనలను ఫిట్టర్లకు ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ కొళాయి కనెక్షన్లను గమనించి వాటిని క్రమబద్ధీకరించుకోవాలని యజమానులకు తెలపాలని ఇంజనీరింగ్ విభాగం వారిని ఆదేశించారు. పాత బకాయిలను వసూలు చేయాలని, పన్ను కట్టని కొళాయి కనెక్షన్‌ను తొలగించాలని తెలిపారు.

సక్రమంగానే బియ్యం వ్యాపారం

మైదుకూరు : తాను బియ్యం వ్యాపారం సక్రమంగానే చేస్తున్నానని మైదుకూరుకు చెందిన ప్రముఖ వ్యాపారి సూరిశెట్టి ప్రసాద్ గుప్తా అన్నారు. స్థానికంగా ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న బహిరంగ వేలంలో బియ్యాన్ని కొనుగోలు చేసి తాను విక్రయిస్తున్నట్టు తెలిపారు. గతంలో అనంతపురం జిల్లాలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన వేలంలో బియ్యాన్ని కొనుగోలు చేసినట్టు చెప్పారు. గత ఏడాది కూడా కర్ణాటకలో ఎఫ్‌సీఐ నిర్వహించిన బహిరంగ వేలంలో 7,600 క్వింటాళ్ల బియ్యాన్ని కొనుగోలు చేసినట్టు వివరించారు. అందుకు సంబంధించిన అనుమతులు, బిల్లులను ఆయన విలేకరులకు చూపించారు. అయితే కొందరు వ్యక్తులు తాను అక్రమ వ్యాపారం చేస్తున్నట్టు అపోహపడి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జూనియర్ డాక్టర్లకు స్టైఫండ్ పెంచాలి

ప్రొద్దుటూరు : పశువైద్య జూనియర్ డాక్టర్లు నెల రోజులకుపైగా సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారి స్టైఫండ్‌ను పెంచాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరు మండలం గోపవరం వద్ద ఉన్న పశువైద్య కళాశాలలో పశువైద్య జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మెకు జనవిజ్ఞాన వేదిక, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు.

చిన్నారి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి, భావన

ప్రొద్దుటూరు కల్చరల్ : సరైన వైద్యం అందక తమ చిన్నారి మృతికి కారణమైన ఫ్లోరెన్స్, వారాహి ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని చిన్నారి తల్లిదండ్రులు మధుసూదన్‌రెడ్డి, భావన తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడుతూ కాన్పు కోసం ఫ్లోరెన్స్ ఆస్పత్రిలో చేరామని, కాన్పు కాగానే బిడ్డ ఏడవకపోవడంతో వారాహి ఆస్పత్రికి తీసుకెళ్లారన్నారు. కానీ బాబు బతికే అవకాశం 30 శాతం ఉందని వారాహి ఆస్పత్రిలో చెప్పడంతో కర్నూలు, హైదరాబాద్‌కు వెళతామని చెప్పామని, వైద్యులు అక్కడి ట్రీట్‌మెంట్ ఇక్కడ ఇస్తామని భరోసా ఇచ్చారన్నారు. మెదడులో సమస్య ఉందని, ప్లేట్‌లెట్లు తగ్గాయని, ఇన్‌ఫెక్షన్ ఉందని ఇలా ఏడు రోజుల పాటు వైద్యం చేసి చివరికి బిడ్డ చనిపోయారని చెప్పారన్నారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ చనిపోయాడని ఇటువంటి బాధ మరొకరికి కలగకూడదనే ఉద్దేశంతో ఈ ఆస్పత్రులపై, వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సరైన కారణం లేకుండా అబార్షన్ చేయించుకుంటే కేసులు

ప్రొద్దుటూరు క్రైం : తగు కారణం లేకుండా అబార్షన్‌లు చేయించుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, గైనకాలజిస్టు డాక్టర్ యశశ్విని తెలిపారు. జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన అబార్షన్‌లపై వైద్యాధికారులు శుక్రవారం ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని పీపీ యూనిట్‌లో ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మందు బాబు వీరంగం

అట్లూరు : కడప నుంచి బద్వేలు వస్తున్న అల్లా పల్లె వెలుగు ఎపి39 యుజి 4550 నెంబరు బస్సులో ఓ వ్యక్తి పీకల దాకా తాగి బూతులు తిడుతుండటంతో ప్రయాణికులు బరించలేక కొండూరు స్టేజీ దగ్గర బస్సు నుంచి దించి వేశారు. మందుబాబు అక్కడున్న పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లి పోలీసులను సైతం బండ బూతులు తిట్టాడు.

మామిడి, జామ చెట్లు దగ్ధం

బద్వేలు అర్బన్ : రాఘవరెడ్డిపేట గ్రామ సమీపంలో శుక్రవారం ప్రమాదవశాత్తు మామిడి, చెట్లు దగ్ధం కావడంతో పాటు డ్రిప్‌పైపులు దగ్ధమయ్యాయి. శీలంవారిపల్లె గ్రామానికి చెందిన యార్లబోయినశేఖర్, చెన్నమ్మలకు మూడు ఎకరాల పొలం ఉంది. ప్రస్తుతం మామిడి చెట్లు పూత, పిందె దశలో ఉన్నాయి. ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో మామిడిచెట్లు, జామ చెట్లతో పాటు డ్రిప్ పైపులు కాలిపోయాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు.

మద్యం దుకాణం మా ఇళ్ల వద్ద వద్దు

ఖాజీపేట : మద్యం దుకాణం ఏర్పాటు విషయంలో వచ్చిన మనస్పర్థలు టీడీపీ నాయకుల్లో తీవ్ర విభేదాలకు దారి తీశాయి. ఈ పరిణామం చివరకు టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఫ్లెక్సీలు చించి వేసేంత వరకు పోయింది. వివరాల్లోకి వెళితే.. గీతకార్మికుల కోసం ఏర్పాటు చేసిన షాపు నంబర్ 14 మద్యం దుకాణం వేలం పాటలో ఓ వ్యక్తికి వచ్చింది. ఇతను అనుమతులు తీసుకుని కోటింగురువాయపల్లెలో దుకాణం ఏర్పాటు చేశాడు. తొలి రోజే అక్కడ స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దుకాణం వద్ద ఆందోళన చేశారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు, పోలీసులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుల మేరకు దుకాణం తొలగించాలని అధికారులు తెల్పడంతో.. వేరొక చోట పెట్టుకునేందుకు ప్రయత్నం చేశారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ

మద్యం దుకాణం మార్చే క్రమంలో టీడీపీ ముస్లీం మైనార్టీ నాయకులు ఉన్న ఇంటి వద్ద దుకాణం పెట్టుకునేందుకు ఎక్సైజ్ శాఖ అధికారుల వద్ద అనుమతులు తెచ్చుకున్నారు. అయితే అక్కడ మద్యం దుకాణం వద్దని, వేరొక చోట పెట్టుకోవాలని స్థానిక ముస్లిం నాయకులు కొందరు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దుకాణం దారులు మాత్రం తమకు అధికారిక అన్ని అనుమతులు ఉన్నాయని, అక్కడే దుకాణం పెడతాం అని పట్టుపట్టారు. చివరకు పోలీస్ స్టేషన్‌కు పంచాయితీ చేరింది. పోలీస్ స్టేషన్‌లో ముస్లిం నాయకులు, దుకాణాదారులను ఖాజీపేట సీఐ మోహన్ పిలిపించి చర్చించారు. అయితే ఇరు వర్గాలు ఒప్పుకోలేదు. పైగా వారి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. పోలీసులు గట్టిగా అరచి అక్కడ నుంచి అందరినీ పంపించి వేశారు. దుకాణం వద్ద ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఫ్లెక్సీలను ముస్లిం నాయకులు చించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మైనార్టీ నాయకులం అందరం పార్టీకి రాజీనామా చేసి, పార్టీకి దూరం అయితామనే హెచ్చరికలు పరోక్షంగా టీడీపీ నాయకులకు సూచించారు.

మహిళలు ధైర్య సాహసాలతో ముందుకెళ్లాలి

ప్రొద్దుటూరు డీఎస్పీ భావన



డీఎస్పీ భావనను సన్మానిస్తున్న లోకాసమస్త హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు క్రైం : మహిళలు ధైర్య సాహసాలతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని ప్రొద్దుటూరు డీఎస్పీ భావన తెలిపారు. లోకా సమస్త హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం సాయంత్రం ముందస్తు మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సంస్థ సిబ్బందితో కలిసి డీఎస్పీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా లోకాసమస్త హ్యూమన్‌రైట్స్ ప్రతినిధులు, సభ్యులందరూ డీఎస్పీ భావనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమయంలో లోకా సమస్త హ్యూమన్ రైట్స్ రాయలసీమ జిల్లాల విభాగ జనరల్ సెక్రటరి జె శ్రీనివాసులు, మహిళా విభాగ జనరల్ సెక్రటరి ఆర్ రెడ్డిప్రసన్న, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని విభాగాల్లో మహిళలు రాణించాలి

ప్రొద్దుటూరు : మహిళలు అన్ని విభాగాల్లో రాణించాలని డీఎస్పీ భావన తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమం నుండి పోలీసు శాఖ, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, మహిళా పోలీసులు గీతాశ్రమం నుండి గాంధీ రోడ్డు, టీబీ రోడ్డు మీదుగా పుటపర్తి సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. కార్యక్రమంలో సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ గౌరీశంకర్, మౌనయ్య, దావీద్, విమల, హేమలత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు కొత్త ఆలోచనలతో ఆవిష్కరణలు చేయాలి

మహిళలు కొత్త ఆలోచనలతో ఆవిష్కరణలను చేయాలని డీఎస్పీ భావన తెలిపారు. మండలంలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వర రావు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ కె.లావణ్యకుమారి, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంవీవీ ప్రసాద్, అడ్మినిస్ట్రేటర్ రజనీకాంత్‌రెడ్డి, హెచ్ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రూరల్ : స్త్రీలు వ్యవసాయం నుండి అంతరిక్షం వరకు సకల రంగాల్లో విశిష్ట కృషి చేస్తున్నారని ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

మహిళలకు క్రీడా పోటీలు



క్రీడా పోటీల్లో పాల్గొన్న మహిళలు

చాపాడు : చాపాడులోని వెలుగు కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మహిళా ఉద్యోగులకు శుక్రవారం క్రీడా పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా వెలుగు కార్యాలయం, పీహెచ్‌సీలో పనిచేసే మహిళా సిబ్బందికి ఖోఖో, కబడ్డీ, పరుగు పందెం, లెమన్ స్పూన్ ఇంకా పలు రకాలైన క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి శనివారం నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ఆడ పిల్లలను చదివించండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

మైదుకూరు : ఆడ పిల్లలను చదివించాలని, అప్పుడే సమాజంలో వారికి గౌరవం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా సిబ్బందితో కలిసి స్త్రీ శక్తి భవనం నుంచి రాయల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. బేటి బచావో – బేటి పడావో అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఓబుళమ్మ, శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా లోకానికే వన్నె తెచ్చిన ‘మొల్ల’



డాక్టర్ కోడూరు సుమనశ్రీని మొల్ల పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం

గోపవరం : మహిళా లోకానికే వన్నె తెచ్చిన ధృవతార మహాకవయిత్రి మొల్లమాంబ అని తెలుగు కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ కోడూరు సుమనశ్రీ తెలిపారు. తెలుగు సాహితీ యాత్రలు, మొల్ల జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మాతృభాషను మొల్ల రామాయణం ద్వారా సుసంపన్నం చేసిన ధీరవనిత మొల్లమాంబ అన్నారు. మొల్ల పుట్టి నడియాడిన గోపవరంలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు, పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎంతో ధన్యజీవులన్నారు. మొల్లమాంబ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కూచిపూడి నాట్య కళాకారిణి, సాహితీవేత్త డాక్టర్ కోడూరు సుమనశ్రీకి శాలువా, జ్ఞాపిక, మొల్ల సాహితీసేవా పురస్కారం అందజేశారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, కోశాధికారి శ్రీనివాసులు, మహిళా కార్యదర్శి సత్యవతి, బద్వేలు పట్టణాభివృద్ధి సమితి అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు పురస్కారాలు ప్రదానం



పురస్కారాలు అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం గ్రామం సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో శుక్రవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ సలహాదారులు రాజోలు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జీవితమనే నాటకంలో అమ్మ అనే పాత్ర అద్భుతమైనదన్నారు. కుటుంబం పట్ల అత్యంత బాధ్యతగా వ్యవహరిస్తున్న మహిళలను రెండు రాష్ట్రాల స్థాయిలో 25 మందిని గుర్తించి మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ధాత్రి పురస్కారం అందజేశామన్నారు. సేవాశ్రమం నిర్వాహకులు రామకృష్ణారెడ్డి చేతులమీదుగా వారికి పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సామాజిక సేవకురాలు జి.సుజాత, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సంపూర్ణ రక్షణ లభిస్తేనే ఆనందం



సమావేశంలో మాట్లాడుతున్న గౌసియాబేగం

పోరుమామిళ్ల : మహిళలకు ఉద్యోగాల్లో, చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించినా సమస్యలు దూరం కావడం లేదని, సంపూర్ణ రక్షణ లభించినప్పుడే ఆనందించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి గౌసియాబేగం తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఐద్వా జండా ఎగురవేసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌసియాబేగం మాట్లాడుతూ అన్నిరంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, అయితే ఇది సరిపోదని, మరింతగా మహిళల ప్రాధాన్యం పెరగాల్సి ఉందన్నారు. మహిళా రిజర్వేషన్లు 33 శాతం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు, కిడ్నాపులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. రాత్రి ఇంటికి మహిళ ఒంటరిగా పోయే పరిస్థితి లేదన్నారు. ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో బెల్టుషాపులు విచ్చలవిడిగా పెరిగాయని, ప్రతి పల్లెలో మద్యం లభిస్తుండటం వల్ల మగవారు కూలి డబ్బులు మద్యానికే ఖర్చు చేస్తున్నారన్నారు. ఒట్టి చేతులతో ఇంటికి పోయి, మందుకు డబ్బు ఇవ్వాలని మహిళలపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పించినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం జరుపుకోగలమన్నారు. కార్యక్రమంలో ఐద్వా మండల నేతలు ఓబులమ్మ, వెంకటలక్ష్మి, యల్లమ్మ, నాగమణి, జయమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా... నీకు వందనం

కడప కల్చరల్ : నేటి తరం మహిళ అన్ని రంగాల్లో పురుషుడితో సమానంగా అభివృద్ధి సాధిస్తోంది. ఒక దశలో పురుషుల కంటే ఎక్కువగానే దూసుకుపోతోంది. హిందూ పురాణాల్లో కూడా మహిళకు ఎంతో ప్రాధాన్యత కనిపిస్తోంది. త్రిమూర్తుల్లో ... విష్ణుమూర్తి లక్ష్మీదేవిని హృదయంలో నిలుపుకోగా, శక్తిస్వరూపిణి పార్వతీమాతకు ఈశ్వరుడు సగం శరీరం అర్పించగా, బ్రహ్మ చదువుల తల్లి సరస్వతీమాతను నాలుకపై ప్రతిష్ఠించుకున్నారని పురాణాల ద్వారా తెలుస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పుల్లో భాగంగా నేటి మహిళకు విద్య అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం బాలుర కంటే బాలికలే ఎక్కువగా విద్యను అభ్యసిస్తున్నారు. పోటీ పరీక్షల్లో కూడా బాలికలదే అగ్రస్థానం. అట్టడుగు పనుల నుంచి ఇతర గ్రహాలకు వెళ్లడంలో కూడా మహిళ తెగువ చూపుతోంది. ఆమె నేర్చుకోలేని విద్య లేదు. చేయని పని లేదు. అత్యంత కష్టమైన బస్సు కండక్టర్ మొదలుకొని రైళ్లు, విమానాలు నడిపే స్థాయికి ఎదిగి ఇతరులకు స్ఫూర్తినిస్తోంది. దేశంలోని మహిళా అధికారుల సంఖ్య పురుషులతో పోటీ పడుతుండడం గమనార్హం.

మహిళ లేనిదే మానవ మనుగడను ఊహించుకోలేం. ఆకాశంలో సగంగా పేరు పడిన మహిళకు అవకాశాల్లో మాత్రం ఒకింత వెనుకబడి ఉంది. కానీ ఎనలేని ఆత్మవిశ్వాసంతో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో కూడా రాణిస్తున్నారు.

మహిళా దినోత్సవం గురించి..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం 20వ శతాబ్దంలో మొదలైంది. ఉత్తర అమెరికా, యూరప్‌లోని కార్మిక ఉద్యమాల ద్వారా దీనికి పునాదులు పడ్డాయి. మొదటి జాతీయ మహిళా దినోత్సవాన్ని యునైటెడ్ స్టేట్స్‌లో 1909 ఫిబ్రవరి 28న నిర్వహించారు. న్యూయార్క్‌లో సోషలిస్టు మహిళలు, వస్త్ర కార్మికులు తక్కువ పనిగంటలు, అధిక వేతనాలు, ఓటుహక్కు డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనలు చేశారు. అలా మహిళా దినోత్సవం ప్రారంభమైంది. 1910లో కోపెన్ హాగన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సమావేశంలో క్లారా జట్కిన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతిపాదించగా ఆమోదింపబడింది. ఈ దినోత్సవాన్ని మొదటిసారిగా 1911లో అనేక యూరోపియన్ దేశాల్లో నిర్వహించుకున్నారు. 1975లో ఐక్యరాజ్య సమితి అధికారికంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించడం ప్రారంభించింది. 1977లో ఐక్య రాజ్య సమితి మార్చి 8న మహిళా హక్కులు, ప్రపంచ శాంతి కోసం ఐక్యరాజ్య సమితి దినోత్సవంగా ప్రకటించాలని ఆహ్వానించింది. దాంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మార్చి 8న నిర్వహించుకోవడం మొదలుపెట్టారు. 2025 మహిళా దినోత్సవాన్ని క్రియాశీలత అనే అంశంపై నిర్వహించుకుంటున్నారు. మహిళలు, బాలికల హక్కులు సాధికారత, సమాన అవకాశాలు, వివక్ష తొలగింపు తదితర అంశాలపై సంస్థలు కృషి చేయనున్నాయి. అందువల్ల మహిళా దినోత్సవం రోజున ప్రభుత్వ సంస్థలతోపాటు వివిధ స్వచ్ఛంద సంఘాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంఘాలు ఈ దినోత్సవం గురించి ప్రచారం నిర్వహిస్తాయి. స్ఫూర్తిదాయకమైన మహిళలను ఈ సందర్భంగా సత్కరిస్తున్నారు.